సాక్షి తిరుపతి

సోమవారం । 20 । మార్చి । 2023



22న కాణిపాకంలో ప్రత్యేక పూజలు

కాణిపాకం (యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో బుధవారం ఉగాది సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి ఆదివారం తెలిపారు.



కిలకిల అందాలు

దొరవారిసత్రం: నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలో వలస విహంగాల విన్యాసాల పక్షిప్రేమికులను కట్టిపడేస్తున్నాయి. ఆదివారం వర్షం కురుస్తున్నా పలువురు విచ్చేసి పక్షుల సందడిని తిలకించారు.

ఉరమకే మేఘమా!

తిరుమల: తిరుమలలో ఆదివారం వర్షం ముంచెత్తింది. కానుకలు తడవకుండా హుండీలపై టార్పాలిన్ పట్టలు కప్పి పరకామణికి తరలించడం కనిపించింది.

– తిరుమల



న్యూస్‌రీల్

ఉన్నత విద్యకు 'దీవెన'

- 40,792 మంది ఖాతాల్లో రూ.30.36 కోట్లు జమ

తిరుపతి అర్బన్ : పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ఆర్థిక సాయం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న విద్యాదీవెన పథకాన్ని అమలు చేస్తోంది. అందులో భాగంగా ఆదివారం ఎన్‌టీఆర్ జిల్లా తిరువూరు నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ ఏడాది తొలి త్రైమాసిక నగదును బటన్ నొక్కి విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి జమ చేశారు. తిరుపతి కలెక్టరేట్‌లో ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి చెన్నయ్య జిల్లా స్థాయి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా విద్యాదీవెన కింద మొత్తం 40,792 మంది లబ్ధి చేకూరుతోందన్నారు. దాదాపు రూ.30.36 కోట్లను విద్యార్థుల తల్లుల ఖాతాలోకి జమ చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి భాస్కర్‌రెడ్డి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో 'స్పందన'



వెంకటరమణారెడ్డి, కలెక్టర్

తిరుపతి అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. స్పందనకు జిల్లా స్థాయి ఉన్నతాధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. అర్జీదారుల కోసం తిరుపతి సెంట్రల్ బస్టాండ్ నుంచి బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు వివరించారు. అలాగే వినతులు రాసేందుకు ప్రత్యేకంగా ముగ్గురు పీఆర్‌ఓలను నియమించామన్నారు. అలాగే అన్ని సచివాలయాల్లో రోజూ తప్పనిసరిగా స్పందన కార్యక్రమం నిర్వహించాలని స్పష్టం చేశారు.

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. స్వామి, అమ్మవార్లను సుమారు 25వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయాధికారులు తెలిపారు. రూ.200 టికెట్ల ద్వారా 980మంది, రూ.50 టికెట్ల ద్వారా 2,474మంది భక్తులు దర్శించుకున్నట్లు వెల్లడించారు. రూ.500 రాహుకేతు పూజా టికెట్లను 2,816 మంది, రూ.750 టికెట్లను 1,182, రూ.1,500 టికెట్లను 246, రూ.2,500 టికెట్లను 230, రూ.5వేలు టికెట్లను 64మంది భక్తులు కొనుగోలు చేసినట్లు వివరించారు.

రైతు రుణాలకు 'సహకారం'



సమావేశంలో మాట్లాడుతున్న సీఈఓ శంకర్‌బాబు

వెంకటగిరి: రైతులకు సహకార బ్యాంకుల్లో విరివిగా రుణాలు మంజూరు చేస్తున్నట్లు బ్యాంకు సీఈఓ సి.శంకర్‌బాబు తెలిపారు. ఆదివారం పట్టణంలోని వెంకటగిరి పీఏసీఎస్ సొసైటీలో బంగారు ఆభరణాలను భద్రపరిచేందుకు లాకర్‌ను ప్రారంభించారు. అనంతరం సీఈఓ మాట్లాడుతూ గ్రామాల్లోని సహకార బ్యాంకుల్లో బంగారు నగలపై రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. ఇప్పటికే జిల్లాలోని 25 బ్యాంకుల్లో ఈ వెసులుబాటు కల్పించినట్లు వెల్లడించారు. రైతులకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు అందిస్తున్నామన్నారు. రైతులు ప్రతి ఆరునెలలకు ఒకసారి రుణాలను చెల్లించే అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు. అలాగే గృహ, వాహన రుణాలను సైతం మంజూరు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు కాల్తిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, యాతలూరు సొసైటీ అధ్యక్షుడు నాగేశ్వరరావు, మొగళ్లగుంట సర్పంచ్ కాల్తిరెడ్డి శ్రీశబరి, సభ్యులు చెంచయ్య, చిన్న సుబ్బమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు తంబిరెడ్డి శివారెడ్డి, సదారెడ్డి, బ్యాంకు ఏజీఎం రమేష్‌బాబు, ప్రదీప్, మేనేజర్ రాజా పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయసాధనే లక్ష్యం



తిరుపతిలో నిర్వహిస్తున్న సమతా సైనిక్ దళ్ ర్యాలీలో ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ తదితరులు

తిరుపతి కల్చరల్ : రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ ఆశయసాధనే లక్ష్యంగా దళితులు ముందుకు సాగాలని ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం తిరుపతిలో సమతా సైనిక్ దళ్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కళా గర్జన నిర్వహించారు. ఈ సందర్భంగా బాలాజీకాలనీలోని జ్యోతిరావు పూలే విగ్రహానికి విక్టర్ ప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. కళా బృందాలు కోలాటాలు, భజనలు, డప్పుల దరువుల నడుమ ఇందిరా మైదానం వరకు ర్యాలీ చేశారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ప్రతి దళితుడు తమ హక్కుల సాధనకు, జాతి అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. కళాకారులను జ్ఞాపికలతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో సమతా సైనిక్ దళ్ జాతీయ కన్వీనర్ దిగంబర్ కాంబ్లే, రాష్ట్ర అధ్యక్షుడు పాలేటి ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షుడు ఆమూరు సుధాకర్, సురేంద్రబాబు, ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మేడికొండ సునీల్, సోషల్ వెల్ఫేర్ డీడీ చెన్నయ్య, పారిశ్రామిక వేత్త కోలా ప్రసాద్, తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్ జైభీమ్ రామచంద్ర, సోషల్ మీడియా అధ్యక్షుడు జైభీమ్ అంకన్న, నాయకులు చింతమాకుల రెడ్డెప్ప, రాజేష్, పున్నాక సురేష్, రామ్మూర్తి, గజపతి, చెన్నకేశవులు, సదాశివం పాల్గొన్నారు.

ఇళ్లకు రిజిస్ట్రేషన్ చేయించాలని వినతి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమన

తిరుపతి మంగళం: తిరుపతిలో నివాసం ఉంటున్న వారి ఇళ్లకు రిజిస్ట్రేషన్ చేసుకునే సౌలభ్యం కల్పించాలని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కోరారు. ఆయన ఆదివారం అసెంబ్లీ సమావేశాల్లో తిరుపతి ప్రజల సమస్యలపై చర్చించారు. తిరుపతిలో సుమారు 60వేల ఇళ్లకు పైగా రిజిస్ట్రేషన్లు కాక ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వివరించారు. తిరుపతిలోని ఇళ్ల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి అప్పట్లో వైఎస్సార్ సానుకూలంగా స్పందించారని, అయితే ఆయన అకాలమరణం తర్వాత ఇది మరుగున పడిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పుడు మంచి అభ్యుదయ ఆలోచనలతో రెవెన్యూ తెస్తున్న సంస్కరణలలో భాగంగా తిరుపతిలోని ఇళ్లకు రిజిస్ట్రేషన్లు జరిగేలా అనుమతులు ఇవ్వాలని రెవెన్యూ మంత్రిని అభ్యర్థించారు. దాంతో ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని, అలాగే మంచి పేరు కూడా వస్తుందని తెలిపారు. తిరుపతిలో బొమ్మగుంట, కొర్లగుంట, తాతయ్యగుంట ప్రాంతాల్లోని ఇళ్లతో పాటు కొన్ని మఠాలకు చెందిన స్థలాల్లో కూడా సుమారు 60 వేల మంది నిరుపేదలు ఇళ్లు కట్టుకుని నివసిస్తున్నారని, వారి ఇళ్లకు రిజిస్ట్రేషన్ చేసుకునే సౌలభ్యం కల్పిస్తే, దాంతో వారు ఆ ఇళ్లపై బ్యాంక్‌ల్లో లోన్లు తీసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. స్పందించిన రెవెన్యూ మంత్రి ధర్మానప్రసాద్‌రావు తిరుపతిలోని ప్రజల ఇళ్ల రిజిస్ట్రేషన్లపై పూర్తిగా చర్చించి నిర్ణయం తీసుకుని, న్యాయం జరిగేలా చేస్తానని మంత్రి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

వరుణాగ్రహం



సైదాపురం : కల్లాంలో ఆరబెట్టిన మిరపకాయలు కొట్టుకుపోవడంతో ఏరుతున్న మహిళ (ఇన్‌సెట్) మిర్చీని శుద్ధి చేస్తున్న దృశ్యం

ఈదురు గాలులు.. వడగండ్లు.. జోరు వానలతో జిల్లా అతలాకుతలమైంది. రెండురోజులుగా ప్రకృతి ప్రకోపానికి రైతాంగం ఉక్కిరిబిక్కిరవుతోంది. అకాల వర్షానికి ఆరుగాలం కష్టించి పండించిన పంట పొలంలోనే వాలిపోతుంటే దిక్కుతోచక కొట్టుమిట్టాడుతోంది. కల్లాంలో ఆరబెట్టిన ధాన్యం కళ్లెదుటే వరుణుడి తీవ్రతకు తడిసిముద్దవుతుంటే చేష్టలుడిగిపోయింది. చేతికందిన పంట గాలివాన బీభత్సానికి కొట్టుకుపోతుంటే కన్నీరుపెట్టుకుంటోంది. ఇదే క్రమంలో భారీ వర్షానికి జన జీవనం అస్తవ్యస్తంగా మారిపోయింది. పెద్దసంఖ్యలో విద్యుత్ స్తంభాలు విరిగిపోవడంతో కరెంట్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఎక్కడికక్కడ రోడ్లపై చెట్లు పడిపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఎదురైంది. పలు ప్రాంతాల్లో చిరువ్యాపారుల పరిస్థితి దయనీయంగా తయారైంది. పెనుగాలులకు దుకాణాలు దెబ్బతినడంతో ఎటూ పాలుపోని దుస్థితి దాపురించింది. వ్యాపారం సాగక జీవనం కష్టతరంగా మారింది. మొత్తంమీద జిల్లావ్యాప్తంగా కురుస్తున్న వర్షం అన్ని వర్గాలను తీవ్రంగా ఇబ్బందిపెడుతోంది. ఎప్పటికప్పుడు అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉంటూ నష్టనివారణకు కృషి చేయడమే ప్రజలకు ఊరటనిస్తోంది. – సాక్షి, తిరుపతి



తిరుమలలో భారీ వర్షానికి దుకాణదారుల ఇక్కట్లు



వెంకటగిరి : తడిసిన వరిని యంత్రం సాయంతో నూర్పిడి చేస్తున్న దృశ్యం

పులికాట్‌కు గర్భశోకం

విదేశీ విహంగాలకు భూతలస్వర్గంగా పులికాట్ సరస్సు వర్ధిల్లుతోంది. కనుచూపు మేర నీళ్లు.. మధ్యలో చెట్లు.. చుట్టూ పచ్చిక బయళ్లు.. చేపల ఉత్పత్తికి నిలయంగా విరాజిల్లుతోంది. ఇలాంటి సరస్సును వానపాముల ముఠా సర్వనాశనం చేస్తోంది. ఇష్టారాజ్యంగా తవ్వేస్తూ గుంటలు మిట్టలుగా మార్చేస్తూ..పులికాట్ సరస్సుకు గర్భశోకాన్ని మిగులుస్తోంది. దీన్ని అరికట్టాల్సిన యంత్రాంగం మామూళ్ల మత్తులో జోగుతోంది. సిబ్బంది లేమితో వైల్డ్‌లైఫ్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.



- వానపాముల కోసం ఇబ్బడిముబ్బడిగా తవ్వేస్తున్న ముఠా
- జోరుగా అక్రమరవాణా
- సిబ్బంది లేమితో కన్నెత్తి చూడని యంత్రాంగం
- వేనాడు, ఇరకం దీవుల చుట్టూనే తవ్వకాలు అధికం



తరలించేందుకు ప్లాస్టిక్ కవర్లలో పార్శిల్ చేసిన వానపాములు (ఫైల్)

సూళ్లూరుపేట: ఆంధ్ర–తమిళనాడు రాష్ట్రాల పరిధిలో ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన పులికాట్ సరస్సులోని వానపాములను ఇబ్బడి ముబ్బడిగా తవ్వేస్తున్నారు. అక్రమ సంపాదనకు అలవాటు పడిన కొంతమంది తీరప్రాంత గ్రామాల్లో ఉండే కూలీలను ప్రోత్సహించి తవ్వకాలు సాగిస్తున్నారు. దీంతో సరస్సు గుట్టలుమిట్టలుగా మారి సహజత్వాన్ని కోల్పోతోంది. గత ఐదారేళ్ల నుంచి ఇదే తంతు. సూళ్లూరుపేట, తడ మండలాల్లో సాగుతోంది. కొంతమంది ఈ వ్యాపారాన్ని ఎంపిక చేసుకుని స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేసి వానపాములను తరలిస్తున్నారు. ముఖ్యంగా తడ మండలం వేనాడు, ఇరకం దీవులకు చుట్టూ వానపాముల తవ్వకాలు చేస్తున్నారు. వేనాడు దీవిలోని మూల, పల్లిపేట కుప్పం వేనాడులోని వ్యవసాయ కూలీలకు చేతినిండా పని దొరుకుతుండడంతో తవ్వకాలకు ఆసక్తి చూపుతున్నారు. కేజీ వానపాములు తీస్తే రూ.900 దాకా గిట్టుబాటవుతోంది.

కఠినమైన చట్టాలు లేకపోవడంతో..

వానపాములు అక్రమ రవాణాపై పులికాట్ వన్యప్రాణి సంరక్షణకేంద్రం వారు కేసులు బలంగా పెట్టకపోవడంతో ఈ వ్యాపారం మూడు పువ్వులు.. ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. ఏవైనా కేసులు పట్టుకున్నపుడు కఠినమైన చట్టాలు లేకపోవడంతో ఈ వ్యాపారం చేసే వాళ్లు ఆ ఏముందిలే అనుకుని సరస్సును కుళ్ల బొడుస్తున్నారు. ఈ నేపథ్యంలోనే సరస్సులో మత్స్యసంపద భారీగా తగ్గిపోతోంది. ముఖ్యంగా రొయ్యలు ఉత్పత్తి పూర్తిగా పడిపోయిందని మత్స్యకారులు గగ్గోలు పెడుతున్నారు.

దాడులేవీ?

వానపాములు అక్రమ రవాణా చేసేవారితో వైల్డ్‌లైఫ్ సిబ్బంది కొందరు చేతులు కలిపి నెల మామూళ్లు తీసుకుని వారికి పరోక్షంగా సహకరిస్తున్నారే ఆరోపణలున్నాయి. ఒకవైపు ప్రభుత్వం ఇచ్చే జీతాలను తీసుకుంటూ మరోవైపు అక్రసంపాదనకు అలవాటు పడిపోయి ఎంతోమందికి జీవనోపాధిని కల్పిస్తున్న పులికాట్ సరస్సుకు చేటు చేస్తున్నారు. ఎవరో సమాచారం ఇస్తే తప్ప సిబ్బంది నిఘా వేసి దాడులు చేసి పట్టుకున్న సందర్భాలే లేవు. పులికాట్ సరస్సు పరిధిలో ఒక్కొక్కరికి ఒక్కో ప్రాంతాన్ని కేటాయిస్తూ బీట్ ఆఫీసర్లను ఏర్పాటు చేయాల్సి ఉంది. సూళ్లూరుపేట పట్టణంలోని ఉన్న వైల్డ్‌లైఫ్ కార్యాలయంలో 30 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా 8 మంది మాత్రమే ఉన్నారు. ఇందులో నలుగురు మహిళా సిబ్బంది. మిగిలిన నలుగురితో బీట్‌లు వేయకపోవడంతో వారు కార్యాలయానికే పరిమితమైపోయారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే, కట్టుదిట్టమైన చర్యలు తీసుకోకుంటే విదేశీ వలస విహంగాలు కూడా రాకుండాపోయే దుస్థితి దాపురించే ప్రమాదముందని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు.

వేనాడు, ఇరకం దీవులనుంచి స్టాక్ పాయింట్లకు తరలింపు

వేనాడు, ఇరకం దీవుల్లోని కూలీలు తవ్వి వానపాములను పాలిథిన్ కవర్లలో వేసుకుని స్టాక్‌పాయింట్లుకు తరలిస్తారు. అక్కడ థర్మాకోల్ షీట్లతో తయారుచేసిన బాక్సుల్లో, కుండల్లో, ప్లాస్టిక్ బక్కెట్లలో ప్యాక్ చేసి కార్లలో వీటిని ప్రకాశం, ఉభయ గోదావరిజిల్లాలు, కృష్ణా జిల్లాల్లోని అక్వా హేచరీలకు తరలిస్తున్నారు. పులికాట్ సరస్సులో దొరికే వానపాములకు రొయ్యల హేచరీల్లో మంచి డిమాండ్ ఉండడంతో ఈ ప్రాంతంలోని చాలామంది ఈ అక్రమ వ్యాపారాన్ని నడుపుతున్నారు. కిలో వానపాములు పడితే కూలీలకు రూ.750 నుంచి రూ.900 ఇస్తున్నారు. హేచరీలకు తరలించి విక్రయించే వారికి కిలో వానపాములు రూ.5 వేల నుంచి రూ.6 వేల వరకు విక్రయిస్తున్నారు.



ప్లాస్టిక్ బక్కెట్లలో వానపాములు (ఫైల్)

టీడీపీది శునకానందం

- మంత్రి ఆర్కేరోజా ధ్వజం



నగరి: ఎమ్మెల్సీ ఎన్నికల్లో మూడు స్థానాల గెలుపుతో టీడీపీ పొందుతున్నది శునకానందమేనని మంత్రి ఆర్కేరోజా ధ్వజమెత్తారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. సింహం పన్నెండు మందిని చంపినా అది వార్త అవదని అదే పంది ఇద్దరిని చంపినా అదో పెద్ద వార్తవుతుందని అదే నేడు టీడీపీ పరిస్థితి అని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికలు పార్టీ గుర్తుతో జరిగేవి కాదన్నారు. రెండో ప్రాధాన్యత లెక్కింపులో పీడీఎఫ్ అభ్యర్థుల మద్దతుతో గెలిచి టీడీపీ నాయకులు చంకలు గుద్దుకుంటున్నారన్నారు. ఇది వారికి బలుపు కాదని వాపు మాత్రమే అన్నారు. ఒక్కో నియోజకవర్గంలో రెండు లక్షల ఓట్లుంటే ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగింది.. ఐదారు వేల ఓట్లకు మాత్రమే అన్నారు. ప్రభుత్వంపై ఉపాధ్యాయులు వ్యతిరేకంగా లేదని ఉపాధ్యాయ ఎమ్మెల్సీల గెలుపుతో తేలిందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి తొలిసారని, అదీ కొత్త పద్ధతిలో జరిగే ఎన్నికలన్నారు. ఇప్పటి వరకు ఈ ఎన్నికల్లో వామపక్షాలవారే గెలుస్తూ వచ్చారని, అయితే వారు రాజ్యాధికారం పొందింది లేదన్నారు. అదే టీడీపీ విషయంలోనూ జరుగుతోందన్నారు. విద్యావంతులు తనకు ఓటేశారని చంద్రబాబు అంటున్నారని. బాబు వస్తే జాబు వస్తుందని చెప్పి ఆయన కుమారునికి మాత్రం జాబిచ్చారని అందుకు ఆయనకు ఓటేశారా, అనుభవం ఉందని రాష్ట్రాన్ని ఆయన చేతిలో పెడితే రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచినందుకా చెప్పాలన్నారు. ఈ ఎన్నికల్లో గెలుపు ఎలా వచ్చిందో తెలియక టీడీపీ వారే కన్ఫ్యూజన్‌లో ఉన్నారన్నారు. పార్టీ సింబల్‌తో ఏ ఎన్నిక వచ్చినా అది వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీకి వార్ వన్ సైడ్ అన్న ధోరణిలోనే జరుగుతుందని చెప్పారు.

క్లీన్‌స్వీప్ చేయడమే లక్ష్యం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి

గూడూరు : రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో అన్ని స్థానాల్లో గెలుపొందడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా గెలుపొందిన తర్వాత మేరిగ మురళీధర్ తొలిసారిగా ఆదివారం గూడూరుకు వచ్చారు. ఈసందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో నేదురుమల్లి మాట్లాడారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన మేరిగ మురళీధర్ సేవలను గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారన్నారు. పార్టీలో నిబద్ధతతో పనిచేసే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు వస్తుందని తెలిపారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీని గెలిపించుకున్నామని, పట్టభద్రుల స్థానం కోల్పోవడంపై కారణాలను తెలుసుకుంటున్నామని వివరించారు. మేరిగ మురళీధర్ మాట్లాడుతూ కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. సమావేశంలో సీఈసీ సభ్యులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, కొడవలూరు ధనుంజయరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు నల్లపరెడ్డి వినోద్‌రెడ్డి, కొడవలూరు దామోదర్‌రెడ్డి, పొనకా దేవసేనమ్మ, కోడూరు కల్పలత, పార్టీ పట్టణ అధ్యక్షుడు బొమ్మి శ్రీనివాసులు, యద్దల నరేంద్రరెడ్డి, కోడూరు మీరారెడ్డి, ఓడూరు యమునమ్మ, బత్తిని విజయకుమార్ పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

హోరాహోరీగా ఫుట్ బాల్ పోటీలు



విన్నర్స్‌కు ట్రోఫీ అందిస్తున్న ప్రవీణ్ తదితరులు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని ఎస్వీ ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఆదివారం జిల్లా స్థాయి ఫుట్ బాల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. 13బాలుర జట్లు, 3బాలికల జట్లు పాల్గొన్న ఈ పోటీలను లీగ్, నాకౌట్ విభాగాల్లో రసవత్తరంగా సాగాయి. బాలుర ఫైనల్స్‌లో రేణిగుంటలోని కంబైన్డ్ పాఠశాల జట్టుపై చంద్రగిరి ప్రభుత్వ హైస్కూల్ జట్టు గెలుపొందింది. బాలికల విభాగంలో తిరుపతిలోని ఎస్వీయూ క్యాంపస్ పాఠశాల జట్టుపై ఎస్పీజేఎన్ఎం స్కూలు జట్టు విజయం సాధించింది. విన్నర్స్, రన్నర్స్ జట్లకు జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్, రెడ్డెప్ప, ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.ప్రవీణ్, శ్రీధర్, డీఎస్ఏ చీఫ్ కోచ్ సయ్యద్ సాహెబ్ చేతుల మీదుగా ట్రోఫీలు అందించారు.

క్లుప్తంగా

రైతు బిడ్డకు గేట్‌లో ఆలిండియా ర్యాంకు


సాయికుమార్‌రెడ్డి

భాకరాపేట : తిరుపతి జిల్లా, చంద్రగిరి నియోజకవర్గం, చిన్నగొట్టిగల్లు మండలం, చట్టేవారి పాళెం పంచాయతీ, బద్దలవారిపల్లెకు చెందిన రైతు బిడ్డ బద్దల సాయికుమార్‌రెడ్డికి గేట్‌లో ఆలిండియా ర్యాంకు 107 సాధించాడు. గ్రామానికి చెందిన అమరనాథ్‌రెడ్డి, రాజేశ్వరి దంపతులు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరి రెండవ కుమారుడైన సాయికుమార్‌రెడ్డి ప్రస్తుతం ఎన్‌ఐటీ మిజోరాంలో బీటెక్ ఫైనల్‌ఇయర్ చదువుతున్నాడు. ఎంటెక్ (సీఎస్‌ఈ) చేయాలన్న లక్ష్యంతో గేట్ రాశాడు. ఆలిండియా స్థాయిలో 107 ర్యాంకుతో సాధించాడు. మొదటి కుమారుడు సంతోష్‌రెడ్డి ఎంబీబీఎస్‌లో ఫ్రీ సీట్ సాధించి కడప రిమ్స్‌లో ఫైనల్ ఇయర్ చేస్తున్నాడు. ర్యాంకు సాధించిన రైతు బిడ్డ నియోజకవర్గానికి గుర్తింపు తెచ్చారని తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి కొనియాడారు.

సీతారాముల కల్యాణానికి విస్తృత ఏర్పాట్లు

- అన్ని ఏర్పాట్లు 31 నాటికి పూర్తిచేయాలి
- టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి


అధికారులతో సమీక్షిస్తున్న టీటీడీ ఈఓ ధర్మారెడ్డి

తిరుపతి అలిపిరి: టీటీడీ ఆధ్వర్యంలోని ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామి కల్యాణోత్సవానికి సంబంధించి ఈనెల 31వ తేదీ లోపే పూర్తి చేయాలని ఈఓ ఏవీ ధర్మారెడ్డి అధికారులను ఆదేశించారు. ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై వైఎస్‌ఆర్ జిల్లా కలెక్టర్ విజయరామరాజు, జిల్లా ఎస్పీ అన్బురాజన్, జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో ఈఓ ఆదివారం ఒంటిమిట్టలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ టీటీడీ అధికారులు, అన్ని విభాగాల అధికారులను సమన్వయం చేసుకుని ఈ నెల 31వ తేదీలోగా కల్యాణ వేదిక వద్ద అన్ని పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. ఏప్రిల్ 5వ తేదీ సీతారాముల కల్యాణాన్ని అత్యంత అద్భుతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కల్యాణానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తారన్నారు. వైఎస్‌ఆర్ జిల్లా కలెక్టర్ విజయరామరాజు మాట్లాడుతూ శ్రీసీతారాముల కల్యాణానికి విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేపట్టనున్నట్లు తెలిపారు. ఎస్పీ అన్బురాజన్ మాట్లాడుతూ, గత ఏడాది 3,500 మందితో బందోబస్తు ఏర్పాటు చేశామని, ఈసారి 4వేల మందిని బందోబస్తుకు నియమిస్తున్నామని చెప్పారు. టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం, వైఎస్‌ఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ సాయికాంత్‌వర్మ, ఎస్వీబీసీ సీఈఓ షణ్ముఖకుమార్, టీటీడీ సీఈ నాగేశ్వరరావు జిల్లా యంత్రాంగానికి చెందిన వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

వేగవంతంగా పనులు: జేఈఓ వీరబ్రహ్మం

శ్రీ కోదండ రాముని బ్రహ్మోత్సవాలు , కల్యాణోత్సవానికి సంబంధించిన పనులు వేగంగా జరుగుతున్నాయని జేఈఓ వీరబ్రహ్మం తెలిపారు. కల్యాణ వేదిక వద్ద జరుగుతున్న పనులను ఈఓ, కలెక్టర్, ఎస్పీతో కలిసి పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కల్యాణానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన అధికారులను ఆదేశించారు.

కోదండరాముని బ్రహ్మోత్సవాలకు శ్రీకారం


సేనాధిపతి ఉత్సవం నిర్వహిస్తున్న అర్చకులు, అధికారులు

తిరుపతి కల్చరల్ : శ్రీకోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆదివారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించారు. ఈనెల 28వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగనున్నాయి. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి పరివార దేవతలకు తిరుమంజనం జరిపించారు. అనంతరం ఉత్సవమూర్తులకు అభిషేకం, తోమాలసేవ, సహస్రనామార్చన చేశారు. సాయంత్రం 5.30 నుంచి 6.30 గంటల వరకు వేదప్రబంధ శాత్తుమొర నిర్వహించారు. 6.30 నుంచి 7.15 గంటల వరకు సేనాధిపతి ఉత్సవం చేపట్టారు. రాత్రి 7.15 గంటల నుంచి మేదినీ పూజ, మృత్సంగ్రహణం, శాస్త్రోక్తంగా అంకురార్పణం నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద జీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈఓ మోహన్, సూపరింటెండెంట్ రమేష్, ప్రధాన అర్చకుడు ఏపీ ఆనందకుమార్ దీక్షితులు పాల్గొన్నారు.


పుష్పాలంకరణలో ధ్వజస్తంభం

నేడు ధ్వజారోహణం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 8.45 నుంచి 9.32 గంటల మధ్య ధ్వజారోహణం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సీతాలక్ష్మణ సమేత శ్రీకోదండరామస్వామివారు, ధ్వజపటం, చక్రత్తాళ్వారులకు తిరువీధి ఉత్సవం చేపట్టనున్నారు.

ఇటు మధురం.. అటు లవణం!

ఆధ్యాత్మిక క్షేత్రంగా విరాజిల్లుతున్న ఏర్పేడు వ్యాసాశ్రమంలో విశిష్ట తీర్థాలు అబ్బురపరుస్తున్నాయి. ఆశ్రమ వ్యవస్థాపకులు సద్గురు మలయాళస్వామివారి అధిష్టాన మందిరం ఎదుట రెండు కొలనులు ఉన్నాయి. అందులో పురాతన కాశీబుగ్గ తీర్థం ఒకటి. ఇందులోని నీరు వనమూలిక సమ్మేళనంతో మధురంగా ఉంటుంది. ఎంతటి వేసవిలో అయినా కొలనులో నీటి మట్టం తగ్గదు.. ఎంతటి వానలు కురిసినా పెరగదు. ఆ పక్కనే మరో కొలను ఉంటుంది. ఇందులోని నీరు ఉప్పు కషాయంగా ఉంటూ తాగేందుకు వీలుండదు. ఇది కూడా ఎప్పుడూ ఎండిందీ లేదు.. పొంగిందీ లేదు. పక్క పక్కనే ఉన్న కొలనుల్లోని నీటి వైవిధ్యాన్ని స్థల విశిష్టతగా భక్తులు చెబుతుంటారు. చారిత్రక ప్రాశస్త్యం గల ఈ రెండు కొలనులను ఆశ్రమ నిర్వాహకులు ఇటీవల అభివృద్ధి చేశారు. - రేణిగుంట


అధిష్టానమందిరం


తియ్యటి నీటితో కాశీబుగ్గ తీర్థం


ఉప్పునీటి కొలను

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు


శ్రీవారి ఆలయం వద్ద జస్టిస్ మన్మథరావు


ఎస్సీ ,ఎస్టీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్

తిరుమల: తిరుమల శ్రీవారిని ఆదివారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మథరావు, ఎస్సీ, ఎస్టీ చైర్మన్ విక్టర్ ప్రసాద్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

వలంటీర్‌కు విశిష్ట సేవా పురస్కారం

రేణిగుంట : మండలంలోని తూకివాకం పంచాయతీ వలంటీర్ పడవేటి శ్రావణి ఆదివారం న్యూఢిల్లీలో ఉత్తమ మహిళా విశిష్ట సేవా పురస్కారం అందుకున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రివర్స్ ఆఫ్ లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ అండ్ ఎన్‌హెచ్‌ఆర్‌సీ వారు ఈ అవార్డును అందజేశారు. జాతీయస్థాయిలో ప్రతిష్టాత్మక అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందని వలంటీర్ శ్రావణి తెలిపారు. వే ఫౌండేషన్ అధ్యక్షుడు పైడి అంకయ్య, లైఫ్ సొసైటీ అధ్యక్షుడు వినయ్‌కుమార్ అభినందించారు.



అవార్డు అందుకుంటున్న వలంటీర్ శ్రావణి

24 టన్నుల రేషన్ బియ్యం సీజ్

కుప్పం: కర్ణాటక రాష్ట్రం బంగారు పేటకు అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న 24 టన్నుల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని బైరుగానిపల్లె వద్ద బియ్యం బస్తాల ప్యాకేజీ యూనిట్‌పై విజిలెన్స్ సీఐ మల్లికార్జున బృందం దాడులు చేపట్టారు. లారీల ద్వారా తరలించేందుకు సిద్ధంగా ఉన్న బియ్యాన్ని సీజ్ చేశారు. ఆయన మాట్లాడుతూ, కుప్పం పరిధిలోని గ్రామాల్లో రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి, పాలిష్ పెట్టి వివిధ బ్రాండ్ల పేరిట విక్రయిస్తున్నట్లు తమ విచారణలో తేలిందని వెల్లడించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

ADMISSIONS

■ Ph.D, Arts / Science - Part Time Ph.D, Engineering & Technology, B.Com, B.Sc., B.Tech, 100% Pass A.P. College ✆ 9393622612.

■ Distance/ Regular.M.Tech, B.Tech, Diploma, B.A, M.A, B.Com, M.Com, B.Sc, M.Sc, BBA, MBA, BCA, MCA, Ph.D, 10th, Inter. Maruthi Academy, Tirupati ✆ 9032030146/147.

DIRECT FINAL YEAR

■ Last Chance:10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT,B.Tech,Diploma,MA,M.Com,M.Sc, MBA,MCA.Regular/lateral entry.9381287629

Real Estate

■ గొప్ప ఆఫర్. 10 Grams Gold- తిరుపతిలో తుడా అప్రూవ్డ్ ఇండ్లు 2 & 3 BHK Flats, Villas, ఓపెన్ ప్లాట్స్ Near 6 Lines హైవే రోడ్, Govt. IIT, Airport, IT & ఎలక్ట్రానిక్స్ హబ్ దగ్గరలో అమ్మకానికి కలవు. ప్లాట్స్ అమ్మడానికి ఏజెంట్స్ కావలెను. ✆ 97008 77999.

LAND FOR SALE

■ For Sale Single bit prime Land of 163 Acres. Clear title. Near Highway road-front. Excellent environment for living, business and agriculture. Red soil with high iron content. Nawabpet (V),Chityala(M),Jayashankar Bhupalpally (D). Contact: 7675868777, 9390085828. info@amodagroup.com

PLOTS FOR SALE

■ బంగారుపాళ్యం, సాయి ఆశ్రయ వెంచర్ అప్రూవ్డ్ Plot No.02, 51,104 సైట్స్ అమ్మకానికి అందుబాటులో కలవు. సంప్రదించండి: 9949100394.

■ తిరుపతి బైపాస్ నుండి 2 K.Mలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న కార్పొరేట్ స్కూల్స్, ఎమరాల్డ్స్, శ్రీ చైతన్య కాలేజీలు, విష్ణుప్రియ విల్లాస్‌కు సమీపాన 100 Feets తారు రోడ్డుకు దగ్గరగా దుర్గసముద్రం వద్ద అన్ని తరగతుల వారికి సొంత ఇంటి స్థలాలు Ready for Registration తో 100% వాస్తు Plotsఅమ్మకమునకు కలవు.7799412641.

TOLET

■ రాఘూరు పాతబస్టాండ్ సెంటర్‌లో మైన్‌రోడ్ సెంటర్ నందు 700 చదరపు అడుగుల కొట్టు మరియు కొట్టుపైన 700 చదరపు అడుగుల కొట్టు బాడుగకు ఇవ్వబడును. సంప్ర : 73308 45521.

Services

డిస్కౌంట్ సేల్స్

■ Reddy's Pharmacy, Opp.Vijaya Diagnostic, Tirupati లో అన్ని రకాల మందులపై 10% to 30% డిస్కౌంట్, సర్జికల్& ఎమర్జెన్సీ మెడిసన్స్ హోం డెలివరీ కలదు. ✆ 94413 49339.

బంగారం కొనబడును

■ బ్యాంక్ మరియు ఫైనాన్స్ కంపెనీలలో కుదువపెట్టిన బంగారం విడిపించి కొనబడును. గ్రాము ధర రూ.5100. సంప్ర: 9700312403, 9398394289.

■ బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. స్పాట్ క్యాష్ ✆ 99 12 72 1888

BUSINESS SERVICE

BUSINESS OFFER

■ Capro కంపెనీ ప్రొవైడ్ అన్ని రకములైన బిజినెస్ ప్రాపర్టీ ప్రాజెక్టు కొరకు LAP & Agent's కావలెను, మంచి జీతం + కమీషన్, ✆ 9319814720.

TOURS & TRAVELS

■ చార్‌ధామ్ యాత్ర 12-6-23, 3 tier ఏసి రైలు, 16రో॥ టికెట్ ఒక్కింటికి 32వేలు, అమరనాథ్ యాత్ర 28-6-23, 16రో॥ టికెట్ ఒక్కింటికి 30వేలు ST ట్రావెల్స్. ✆ 9885853240.

Wanted

■ JOB VACANCY. Age 18 to 45, 10th to Any Degree, Office job 18,000 to 25,000, Work from home 15,000 to 18,000. ✆ 8712008071.

■ రాధికా మొబైల్స్, తిరుపతి నందు పని చేయుటకు సేల్స్ బాయ్స్ & సేల్స్ గర్ల్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును.సంప్రదించండి: 9849916756.

■ చిత్తూరు పరిసర ప్రాంత మండలాల్లో జాన్ డీర్ (John Deere) ట్రాక్టర్ షోరూం నందు పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్ కావలెను. 2 వీలర్ తప్పనిసరి. ✆ 99599 54927.

■ Tele Callers, కంప్యూటర్ ఆపరేటర్, రిసెప్షనిస్ట్, క్యాషియర్, Supervisorగా M/F కావలెను, జీతం: 8-20 వేలు, అన్ని రకాల ప్రైవేట్ ఉద్యోగాలకు సంప్ర:9000775715.

■ Hydలోని ప్రముఖ Software Company కొరకు B.Tech (2020/21/22) అభ్యర్థులు కావలెను. జీ: 25,000(Training తరువాత) అన్ని రకాల ఉద్యోగాలకు. సంప్ర: 82977 97197.

■ Corporate బ్యాంక్‌లలో పనిచేయుటకు Cashier, Clerks, Senior Officers (Sales), Attenders కావలెను. జీతం: 12,000-40,000 వరకు, 96425 06425.

■ URGENT REQUIREMENT AT GUDUR for Manufacturing Company. Drivers-05, Fitters-12, Welder-12 and Business Development Associate-10 (Any Graduate). Please Mail us at : job.gdrp@gmail.com

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000+ ఇన్సెంటివ్స్, ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586

■ జీతం: 10K-25K+ రూం Free, Hyd. Qul: 5th- any Degree. Urgent గా కావలెను. స్త్రీలు/ పురుషులు, Nurses, Caretaker కావలెను. ఫోన్ : 9000250893

■ For Nagari (AP) SO - Age 50 Yrs with Working Knowledtge. Sal - (23K to 25K).Free Accommodation & Canteen available, 8 hrs + 4 Off. Immediate Appointment. Contact: 9840731203, 7358188113.

■ హరేకృష్ణ హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీతం: 16K-18K. విజయవాడ. Ph: 9640528899, 9640648899

■ ప్రముఖ HBCO సంస్థలో AM/BM గా జాబ్ చేయుటకు 28 సం॥లోపు అభ్యర్థులు కావలెను. అర్హత. 10th to డిగ్రీ (P/F), ఫ్రీ రూం, శిక్షణలో 10000/-, తర్వాత 25000 సంపాదన+ఇన్‌సెంటివ్. సెల్: 8897413888.

■ VIP's ఇంట్లో పేషెంట్‌ని చూసుకోడానికి స్త్రీలు/ పురుషులు అర్జెంటుగా కావలెను.ఆయా,వార్డ్ బాయ్స్ ,నర్సులు, వంటవారు, RMP. Dr. Q:5th- డిగ్రీ, 10-30వేలు జీతం. భో+రూం ఫ్రీ. Hyd. 7993583999

■ PLR FOODS PVT LTD, Job Opprtunity, Role: Marketing Officer, Qualification: Graduate, with 2-3 Yrs Office Correspondence Experience, Good at English Speaking & Writing Skills, Location: Tirupati, Drop Resume : finplrfoods@plrprojects.com

■ డైమండ్ ప్రైస్ కిట్స్ సంస్థకు ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. 18-30 సం. అనుభవంను బట్టి జీతం, ఇంటర్వ్యూ: 12వ తేదీ, సంప్ర: భరత్ ఎంటర్‌ప్రైజెస్, కెనడీనగర్, తిరుపతి. ✆ 9550412994.

■ తిరుపతి, తిరుమలలో పనిచేయుటకు సెక్యూరిటీ ఆఫీసర్, సెక్యూరిటీ గార్డ్స్, సెక్యూరిటీ కమ్ డ్రైవర్ &స్టీవార్డ్స్, హౌస్ కీపింగ్,క్లీనింగ్ స్టాఫ్ Male/ Female కావలెను. ✆ 9100518607.

■ కరకంబాడి రోడ్డు,తిరుపతి అగర్బత్తికర్మాగారం ప్యాకింగ్ చేయుటకు 10thనుండి ఇంటర్ వరకు చదివినMale/ Femaleకార్మికులు కావలెను. ఆకర్షణీయమైన జీతం. 9666612193, 7702474849.

■ ఇంటి దగ్గర ఉండి మా కంపెనీ బల్బులు ఫిట్ చేసి ఇవ్వడం ద్వారా నెలకి 15,000-20000 వరకు జీతం మరిన్ని వివరాలకై. 7815811791

■ అతి తక్కువ పెట్టుబడితో కంపెనీ నుండి పంపించే పాత రికార్డ్స్ చూసి కొత్తరికార్డ్స్ వ్రాసినందుకు వారంవారం అధిక ఆదాయం పొందండి. వివరాలకు ఫోన్ చేయండి. 7730898503

■ గ్లోబల్ సర్టిఫైడ్ కంపెనీ నందు గొప్ప అవకాశం. ఇంటి వద్ద చేస్తూ నెలకు 20 వేలు పైన సంపాదన. నిరుద్యోగులు, గృహిణులు, 18+ అందరూ అర్హులే. ✆ 96194 16636


■ ప్రముఖ సంస్థలో పార్ట్ / ఫుల్ టైమ్ పనిచేయుటకు స్త్రీ / పురుషులు అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం : 12,000/-. ఫోన్ : 80084 01243

భూ వివాదంతోనే వృద్ధుడి హత్య


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగసుబ్బన్న

వెంకటగిరిరూరల్ : మండలంలోని పారవోలు దళితవాడలో శుక్రవారం రాత్రి జరిగిన కృష్ణయ్య అనే వృద్ధుడి హత్యకు భూవివాదమే కారణమని డీఎస్పీ నాగసుబ్బన్న తెలిపారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ పాత కక్షలను మనసులో పెట్టుకునే నిందితుడు తూపిలి సుబ్రమణ్యం పథకం ప్రకారం కృష్ణయ్యను కడతేర్చినట్లు చెప్పారు. నిందితుడిని అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. సమావేశంలో ఇన్‌చార్జి సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ జిలానీ పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య


నాగమ్మ మృతదేహం

చిల్లకూరు : మండలంలోని తూర్పుకనుపూరు పంచాయతీ కొమరావారిపాళెం గిరిజన కాలనీలో ఆదివారం ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలు.. ఈగా చల్లయ్య, నాగమ్మ(35) దంపతులు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మనస్పర్థలతో నాలుగు రోజులుగా భార్యాభర్తలు గొడవలు పడుతున్నారు. ఈ క్రమంలో ఇంట్లోని వారు కూలి పనులకు వెళ్లిన తర్వాత నాగమ్మ గుళికలు తినేసింది. ఇంటికి వచ్చిన కుటుంబీకులు అపస్మారకస్థితిలో ఉన్న నాగమ్మను వెంటనే 108లో గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించింది. దీనిపై పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదు.

పిడుగుపాటుకు ఒకరి మృతి


మృతి చెందిన రమణయ్య

దొరవారిసత్రం : మండలంలోని వెదురుపట్టు గ్రామంలో ఆదివారం సాయంత్రం పిడుగుపాటుకు ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. నాగముంతల రమణయ్య(45) గ్రామ సమీపంలోని పొలాల్లో పశువును మేపేందుకు వెళ్లి తిరిగి వస్తుండగా పిడుగుపాటుకు గురయ్యాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనపై తహసీల్దార్ గోపీనాథ్‌రెడ్డికి గ్రామస్తులు సమాచారం అందించారు.

జగమంత కుటుంబం నాది..


నిరాశ్రయులకు అల్పాహారం ప్యాకెట్లు అందిస్తున్న వెంకటేష్

ఆనందంగా కొనసాగుతున్న జీవితంలో చిన్నపాటి మనస్పర్థలు. క్షణికావేశంలో ప్రాణాలు విడిచిన భార్య. మనస్పర్థలు లేకుంటే జీవితాంతం భార్య ప్రేమను పంచుతూ ఉండేది కదా అన్న మనోవ్యథ. తనకంటూ ఎవ్వరూ లేకున్నా జగమంత కుటుంబం నాది అన్న తలంపు.. పరోపకారంలో ప్రశాంతత వెతుక్కుంటూ పది మందికి కడుపు నింపుతూ ఆదర్శంగా నిలుస్తున్నాడు నగరికి చెందిన వెంకటేష్ అనే రిక్షావాలా.


రిక్షాపై వెళుతున్న వెంకటేష్

- రోజూ పదిమంది పేదలకు అల్పాహారం
- మానవసేవే మాధవ సేవంటూ ఐదేళ్లుగా సాయం
- మనోవ్యథకు మందుగా పరోపకారం
- ఆదర్శంగా నిలుస్తున్న రిక్షావాలా

నగరి : నగరి పట్టణం రామ్‌నగర్‌కు చెందిన వెంకటేష్ (48) పరోపకారంతో ఆదర్శంగా నిలుస్తున్నాడు. జన్మస్థలం తమిళనాడుకు చెందిన దిండివనం. వడివేలు, వళ్లి అనే దంపతుల కుమారుడు. పాతికేళ్ల కిందట కుటుంబసభ్యులను విభేదించి భార్య రాణితో కలిసి జీవనోపాధి వెతుక్కుంటూ నగరి పట్టణానికి వచ్చాడు. తొలుత థమ్స్‌అప్ కంపెనీలో రిక్షాపై లోడ్ తీసుకెళ్లే పనిలో చేరాడు. ఆపై సొంతంగా లోడ్ రిక్షా నడుపుకుంటూ జీవిస్తున్నాడు. ఐదేళ్ల కిందట భార్యాభర్తల మధ్య చిన్నపాటి మనస్పర్థలు వచ్చాయి. క్షణికావేశంలో భార్య ఆత్మహత్యకు పాల్పడింది. మనస్పర్థలు రాకుండా ఉంటే భార్య మృతి చెందేది కాదుకదా అన్న మనోవ్యథ అతన్ని కలచివేసింది. తనకంటూ ఎవరూ లేని ఒంటరిగా మిగిలిపోయాడు. తనను నమ్మి తనతో పాటు వచ్చిన భార్యను పోగొట్టుకున్నానే అన్న బాధతో కంటికి కునుకులేకుండా పోయింది. మానవసేవతో మనసును కుదటపరచుకోవచ్చని చెప్పే సిద్ధాంతాన్ని పాటించాలనుకున్నాడు. నాటి నుంచి ఐదేళ్లుగా తనకున్నదాంతో పరులకు సాయం చేస్తున్నాడు. మున్సిపల్ పరిధి కొత్తపేట అగరవినాయక స్వామి ఆలయం వద్ద 10 మంది నిరాశ్రయులకు రోజూ ఉదయం టిఫన్ అందిస్తున్నాడు. రోజూ కష్టపడితే రూ.500 దాకా వస్తుందని, అందులో కొంత పేదల ఆకలి తీరుస్తున్నాడు.

ఆవేశంలో నిర్ణయాలు వద్దు

'మనస్పర్థలు వచ్చే సమయంలో క్షణికావేశంలో తీసుకునే తప్పుడు నిర్ణయం కుటుంబాన్ని నాశనం చేస్తుంది. అలాంటి తప్పుడు నిర్ణయాల జోలికి వెళ్లొద్దు. నా భార్య అంటే నాకు ఎంతో ఇష్టం. ఆమె క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయం నన్ను ఒంటరిని చేసింది. నాకు జీవితకాలం శిక్షగా మారింది. ప్రస్తుతం నాకంటూ ఎవ్వరూ లేరు. మనసాక్షి అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేకున్నా. పరోపకారంతో ప్రాయశ్చిత్తం చేసుకుంటున్నా. పది మందికి సాయం చేసానన్ని తృప్తితో మనోబాధకు మందువేసుకుంటున్నా. అందరూ నా కుటుంబ సభ్యులే అనుకుంటాను. నా కంటూ పది మంది ఉన్నరన్న భావన నాలో కలుగుతుంది'. – వెంకటేష్, రిక్షావాలా, నగరి